జగన్ పాలనలో ప్రతి ఇంటికీ లబ్ధి

ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా



తాడిచర్లలో సంక్షేమ లబ్ధి బ్రోచర్‌ను అందిస్తున్న ఎమ్మెల్యే ఎలీజా

కామవరపుకోట : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పరిపాలనలో ప్రభుత్వ సంక్షేమ పథకాలతో ప్రతి ఇంటికీ లబ్ధి చేకూరిందని ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా అన్నారు. మంగళవారం మండలంలోని తాడిచర్ల గ్రామంలో నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజల సమస్యల పరిష్కారమే గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఉద్దేశమని ఎవరైనా అర్హులై ఉండి సంక్షేమ పథకాలు అందకపోతే అధికారులు దృష్టికి తీసుకురావాలని, వెంటనే పరిష్కరించే దిశగా కృషి చేస్తానని తెలిపారు. లబ్ధిదారులకు ప్రభుత్వం అందించిన పథకాలు వివరిస్తూ బ్రోచర్ అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఎలీజా మాట్లాడుతూ గత తెలుగుదేశం పార్టీ పాలనలో రాష్ట్రం అభివృద్ధికి నోచుకోక, యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు లేక నిరుద్యోగులుగా మిగిలిపోయారన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రం అభివృద్ధి చెందాలనే లక్ష్యంతో పరిపాలన చేపట్టిన వెంటనే గ్రామ సచివాలయ, వలంటీర్ వ్యవస్థ ద్వారా యువతకు లక్షలాది ఉద్యోగాలు కల్పించి, రాష్ట్రంలోని ప్రతి ఇంటికి అందించిన నవరత్నాల పథకాలతో ప్రజలు లబ్ధి పొంది సంతృప్తిగా ఉన్నారని అన్నారు. దీనితో టీడీపీకి ప్రజాదరణ తగ్గి, జగన్ పరిపాలన నచ్చి టీడీపీ నాయకులు వైఎస్సార్ సీపీలోకి చేరేందుకు ఇష్టపడుతు, పిలుపు కోసం ఎదురుచూస్తున్నారని అన్నారు. మరల రానున్నది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమేనని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ప్రతి ఒక్కరు సీఎం వైఎస్ జగన్‌కు అండగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్లు మిడతా రమేష్ బాబు, నానాది సాగర్, నాయకులు పండు జగదీష్, కోటగిరి కిషోర్ బాబు, నల్లూరు ప్రభాకర్ రావు, షేక్ మేరా సాహెబ్, ఇమ్మడి రాంబాబు, మిడత మారయ్య, పండు, గుడెల్లి జోజి, మద్ది రామయ్య, డేవిడ్ సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కొల్లాయిగూడెంలో మా నమ్మకం నువ్వే జగన్



ప్రజలకు సంక్షేమ లబ్ధి బుక్‌లెట్లు అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు

బుట్టాయగూడెం : మండలంలోని కొల్లాయిగూడెంలో మంగళవారం మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ సరియం లక్ష్మీ, వైస్ ఎంపీపీ గగ్గలోతు మోహన్‌రావు, ఎంపీటీసీ మొడియం వెంకమ్మ సచివాలయం కన్వీనర్లు మొడియం లక్ష్మణరావు, ధర్ముల బాబూరావు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేసిన పథకాలను ప్రజలకు వివరించారు. అదేవిధంగా మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్లను ఇంటి గుమ్మం తలుపులకు అతికించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మొడియం మంగరాజు, మండల సచివాలయ కన్వీనర్ తెల్లం సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు రూ. లక్ష విరాళం



దాతకు విరాళం బాండ్ పత్రాన్ని అందిస్తున్న దృశ్యం

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు ద్వారకాతిరుమల మండలం తిమ్మాపురం గ్రామానికి చెందిన గరిమెళ్ల దుర్గానారాయణరావు మంగళవారం రూ. 1,01,116 విరాళంగా అందజేశారు. ముందుగా ఆయన కుటుంబ సభ్యులతో కలసి స్వామి, అమ్మవార్లను దర్శించారు. అనంతరం ఈ విరాళాన్ని నిత్యాన్నదాన కార్యాలయంలో జమచేయగా, దాతకు ఆలయ ఏఈఓ కేఎల్ఎస్ రాజు విరాళం బాండ్ పత్రాన్ని అందించారు.

చలివేంద్రం ప్రారంభం



తాగునీటి చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం : రోటరీ క్లబ్ కొయ్యలగూడెం శాఖ(3020) అధ్యక్షుడు సిరివెళ్ల సుబ్రహ్మణ్యం మాతృమూర్తి జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని రోటరీ అసిస్టెంట్ గవర్నర్ మద్దు గోపాలకృష్ణ ప్రారంభించారు. తాడేపల్లిగూడెం రోడ్‌లో చెక్ పోస్ట్ సెంటర్ వద్ద ఈ చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ వేసవి అంతటా ఉచితంగా ఆర్‌వో వాటర్ ప్లాంట్ ద్వారా శుద్ధి చేసిన తాగునీటిని అందజేస్తామని రోటరీ అధ్యక్షుడు సిరివెళ్ల సుబ్రహ్మణ్యం, సెక్రటరీ సంకు కొండలరావు తెలిపారు. వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులు, క్లబ్ సభ్యులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

13న జాతీయ లోక్ అదాలత్



మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి కిషోర్

జంగారెడ్డిగూడెం : రాష్ట్ర, జిల్లా న్యాయ సేవాధికార సంస్థల ఆదేశాల మేరకు ఈనెల 13న పట్టణంలోని కోర్టులో జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జూనియర్ సివిల్ జడ్జి సీహెచ్ కిషోర్ కుమార్ తెలిపారు. ఈ జాతీయ లోక్ అదాలత్‌లో పెండింగ్‌లో ఉన్న అన్ని సివిల్ కేసులు, రాజీపడదగ్గ క్రిమినల్ కేసులు, చెక్కు బౌన్స్ కేసులు, మనోవర్తి కేసులు, బీఎస్ఎన్ఎల్, బ్యాంకు మొండి బకాయి తదితర కేసులు రాజీ చేసుకోవచ్చని తెలిపారు.

లంకాలపల్లిలో ఈదురుగాలులు



గాలిదుమ్ముతో ఇంటి కప్పు కూలిన దృశ్యం

కుకునూరు : అకస్మాత్తుగా వచ్చిన గాలి దుమారం మండలంలోని లంకాలపల్లి గ్రామాన్ని కుదిపేసింది. మంగళవారం సాయంత్రం ఉన్నట్టుగా ఒక్కసారిగా వాతావరణం చల్లబడి ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. ఆర్‌అండ్‌బీ రహదారిపై పలుచోట్ల చెట్లు పడటంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. స్థానికులు రోడ్డుపై పడిన చెట్లను కొంత మేర ట్రాక్టర్‌తో పక్కకు తొలగించడంతో వాహన రాకపోకలు ప్రారంభమయ్యాయి. బలంగా వీచిన ఈదురుగాలుల ధాటికి లంకాలపల్లి గ్రామానికి చెందిన తెల్లెమ్మ ఇంటి పైకప్పు రేకులు ఎగిరిపడ్డాయి. కూలికి వెళ్లితే తప్ప పూట గడవని ఆమెకు ఆరుగురు కుమార్తెలు. ఎంతో కష్టపడి సొంత ఇంటి నిర్మాణం చేసుకుంటే గాలిదుమారం ఇల్లును చెల్లా చెదురు చేసిందని ఆమె కన్నీరుమున్నీరైంది. తెల్లెమ్మ కుటుంబాన్ని కుకునూరు సర్పంచ్ రావు మీనా వినోద్ పరామర్శించి ప్రభుత్వం తరుపున సహాయం అందేలా చేస్తానన్నారు.

తీసుకోని రుణాలు చెల్లించాలంటూ నోటీసులు

చింతలపూడి : చింతలపూడి సహకార సంఘంలో తీసుకోని రుణాలను చెల్లించాలంటూ నోటీసులు అందాయని, దీనిపై విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని తిమ్మిరెడ్డిపల్లికి చెందిన గంగవల్లి చంద్రశేఖర్ జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ సీఈఓకు ఫిర్యాదు చేశారు. ప్రస్తుతం సహకార సంఘంలో జరిగిన నిధుల దుర్వినియోగంపై విచారణ జరుగుతోందని ఇందులో భాగంగా తన కుమారునికి రూ.10 లక్షలు, రూ.55 వేలు, రూ.1.10 లక్షలు రుణాలు చెల్లించాలని నోటీసులు అందాయని చెప్పారు. విచారణాధికారి నోటీసు ఇవ్వడంతో ఫిబ్రవరిలో తాను సదరు అధికారిని కలిసి వివరణ ఇచ్చినట్లు తెలిపారు. తాను ఇచ్చిన ఫిర్యాదుపై విచారణ జరిపి న్యాయం చేయాలని కోరారు. అదే విధంగా సదరు గ్రామానికి చెందిన కందుల వెంకట కృష్ణారావు అనే రైతు కూడా సోమవారం స్పందన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. తాను రుణం మొత్తం చెల్లించానని తన పత్రాలు ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు. సంఘంపై విచారణ జరుగుతున్న నేపథ్యంలో తన పత్రాలు ఇవ్వడానికి అధికారలు అలస్యం చేస్తున్నారని చెప్పారు.

విద్యా రంగానికే అధిక ప్రాధాన్యత



విద్యార్థులను అభినందిస్తున్న చింతలపూడి ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా

కామవరపుకోట : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన చేపట్టినప్పటి నుంచి విద్య రంగానికే అధిక ప్రాధాన్యత కల్పిస్తున్నారని ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా అన్నారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో 10వ తరగతి పరీక్షలలో 557 మార్కులతో మొదటి స్థానం సాధించిన స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన మానుకొండ కృష్ణ ప్రియాంక రాణిని, 552 మార్కులతో రెండవ స్థానం సాధించిన రావికంపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన సింగంశెట్టి సంజన కావ్యాను, 546 మార్కులతో మూడవ స్థానం సాధించిన స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన వెలుగు యామినినీ ఆయన అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రాష్ట్రంలో పేద విద్యార్థులు సైతం ఉన్నత చదువులు చదవాలనే ఉద్దేశంతో నాడు-నేడు కార్యక్రమంతో కార్పోరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను అన్ని మౌలిక వసతులతో తీర్చిదిద్ది, ఇంగ్లిష్ మీడియంను అందిస్తున్నారన్నారు, విద్యార్థుల చదువులకు అమ్మ ఒడి, విద్యా దీవెన, వసతి దీవెన పథకాలు అందిస్తూ వారిని ఆర్థికంగా ఆదుకుంటున్నారన్నారు. మన రాష్ట్ర విద్యార్థులకు సైతం విదేశీ విద్యను అందించే లక్ష్యంతో విదేశీ విద్యా దీవెన పథకం ద్వారా టాప్ పొజిషన్‌లో ఉన్న 200 విదేశీ యూనివర్సిటీలో అడ్మిషన్లు పొందిన, రాష్ట్రానికి చెందిన 213 మంది విద్యార్థులకు రూ.19.95 కోట్లు మొదట విడతగా అందజేశారన్నారు. విద్యార్థులు ప్రభుత్వం అందించే సదుపాయాలను సద్వినియోగపరుచుకుని భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగాలని కోరారు. విద్యార్థులను ఎంఈవో డి.సుబ్బారావు, ప్రధానోపాధ్యాయులు చిన్నం ప్రశాంత్ కుమార్, పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ పండు జగదీష్, ఉపాధ్యాయులు గ్రామస్తులు అభినందించారు.

14న హనుమాన్ శోభాయాత్ర



అయ్యప్పస్వామి ఆలయ కమిటీకి శోభాయాత్ర కరపత్రాలను అందజేస్తున్న వీహెచ్‌పీ నాయకులు

జంగారెడ్డిగూడెం : విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో హనుమజ్జయంతి పర్వదినాన్ని పురస్కరించుకొని మే 14 న శ్రీ మద్ది ఆలయం నుంచి హనుమాన్ శోభాయాత్ర మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు పరిషత్ సభ్యులు కేవీఆర్ సత్యనారాయణ తెలియజేశారు. ఈ శోభాయాత్రకు సంబంధించిన కరపత్రాలు మంగళవారం శ్రీ అయ్యప్ప స్వామి ఆలయం కమిటీ సభ్యులకు అందచేసి వారిని ఈ శోభాయాత్రలో పాల్గొనాలని కోరారు. ఆంజనేయస్వామి శక్తి స్వరూపుడు అని, స్వామిని కొలిచిన వారికి కార్యసిద్ధి ప్రాప్తిస్తుంది అని అన్నారు. కార్యక్రమంలో అయ్యప్ప స్వామి ఆలయ కమిటీ సభ్యులు గంగు జగన్‌మోహన్‌రెడ్డి, తమ్మన వెంకటేశ్వరరావు, కొల్లేపర కృష్ణారావు, రొక్కం కృష్ణారావు, ఆలయ అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

అన్నసమారాధన



వృద్ధాశ్రమంలో నిర్వహిస్తున్న అన్నసమారాధన

కొయ్యలగూడెం : వైఎస్సార్ సీపీ పోలవరం నియోజకవర్గం నేత, ప్రముఖ పారిశ్రామికవేత్త స్వర్గీయ పోతన శేషగిరిరావు జయంతి కార్యక్రమం కన్నాపురం గ్రామ సమీపంలోని వృద్ధాశ్రమంలో మంగళవారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆశ్రమంలోని వృద్ధులకు అన్న సమారాధన, పండ్ల రసాలను పంపిణీ చేశారు. ముందుగా ఆశ్రమంలోని సౌభాగ్య దుర్గాదేవి ఆలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం కొయ్యలగూడెం గ్రామంలో యాచకులకు అన్న సమారాధన చేపట్టారు. వైఎస్సార్‌సీపీ యూత్ నాయకులు పాల్గొన్నారు.

ఉమెన్ డ్రాప్ ఎట్ హోమ్ కార్యక్రమంపై హర్షం

ఏలూరు (టూటౌన్): మహిళల భద్రతకు పెద్ద పీట వేస్తూ ఏలూరు నగరంలో ఉమెన్ డ్రాప్ ఎట్ హోమ్ కార్యక్రమాన్ని ఎస్పీ డి.మేరీ ప్రశాంతి ప్రారంభించడంపై కేంద్ర ప్రభుత్వ పారిశ్రామిక మండలి మాజీ సభ్యుడు పులి శ్రీరాములు మంగళవారం ఒక ప్రకటనలో అభినందనలు తెలియజేశారు. రాత్రి 10 గంటల నుంచి తెల్లవారుజామున 5 గంటల వరకూ దూర ప్రాంతం నుంచి ఏలూరు వచ్చి రవాణా సౌకర్యం లేక ఇబ్బంది పడే మహిళలు 100/112 లేదా 83329 59175కు ఫోన్ చేస్తే వాహనంతో మహిళా కానిస్టేబుల్ వచ్చి గమ్యస్థానానికి చేర్చటం మంచి కార్యక్రమన్నారు.

ముగ్గురు జూదరుల అరెస్ట్

ఏలూరు టౌన్: ఏలూరు అమీనాపేట మీసేవా కేంద్రం సమీపంలోని బహిరంగ ప్రదేశంలో ముగ్గురు వ్యక్తులు కోత బంతి అనే పేకాట ఆడుతుండగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఏలూరు జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి ఆదేశాల మేరకు ఏలూరు టూటౌన్ సీఐ పీ.చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఆ ముగ్గురిపై కేసు నమోదు చేసి అరెస్టు చేశామని టూటౌన్ ఎస్సై కే.ప్రసాద్ మంగళవారం తెలిపారు. వారివద్ద నుంచి రూ.3,010 నగదు స్వాధీనం చేసుకున్నామని ఆయన చెప్పారు.

చదరంగం క్రీడలో విద్యార్థులకు శిక్షణ



కొయ్యలగూడెంలో విద్యార్థులకు చదరంగం క్రీడపై శిక్షణ ఇస్తున్న శేఖర్



ద్వారకాతిరుమలలో గ్రంథాలయంలో పుస్తకాలను చదువుతున్న విద్యార్థులు

కొయ్యలగూడెం : చదరంగం క్రీడను ప్రపంచానికి పరిచయం చేసిన ఘనత మన దేశానికి దక్కుతుందని, భారతీయులుగా మనకు ఇది గర్వకారణమని రాష్ట్రస్థాయి చదరంగా క్రీడాకారుడు ఎస్‌బీజీ శేఖర్ పేర్కొన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో మంగళవారం విద్యార్థులకు చదరంగం క్రీడపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. గ్రంథాలయ పాలకురాలు యు.రాముడు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో రాష్ట్రస్థాయి చదరంగా క్రీడాకారుడు ఎస్‌బీజీ శేఖర్ మాట్లాడుతూ విద్యార్థులు మానసిక ఒత్తిడిని తట్టుకోవడానికి, జ్ఞాపక శక్తిని పెంపొందించుకోవడానికి, చదువులో రాణించడానికి చదరంగం క్రీడ ఎంతగానో దోహదపడుతుందని పేర్కొన్నారు.

గ్రంథాలయంలో నీతి కథల పుస్తక పఠనం

ద్వారకాతిరుమల : స్థానిక శాఖా గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన వేసవి శిక్షణా శిబిరంలో మంగళవారం విద్యార్థులకు నీతి కథల పుస్తక పఠనాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారిణి గుర్రం బంగారుపాప నీతి కథల్లోని సారాంశాన్ని విద్యార్థులకు క్షుణ్ణంగా వివరించారు. నీతి, నిజాయితీ, మంచి, చెడులను విద్యార్థి దశ నుంచే అలవరుచోవాలని, అవి బంగారు భవిష్యత్తుకు బాటలు వేస్తాయన్నారు.

శాఖా గ్రంథాలయంలో స్పోకెన్ ఇంగ్లిష్

జంగారెడ్డిగూడెం : పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణా శిబిరంలో భాగంగా మంగళవారం స్పోకెన్ ఇంగ్లిష్ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు గ్రంథాలయాధికారి పి.దుర్గారావు తెలిపారు. ఈ కార్యక్రమంలో 20 మంది విద్యార్థులు పాల్గొనగా, వారికి ఇంగ్లిష్ ఉపాధ్యాయులు ఎస్.విజయ కుమార్ ఇంగ్లిష్ భాష మాట్లాడటం, రాయడం వంటి అంశాలపై వివరించారు. అనంతరం విద్యార్థులకు ఇంగ్లిష్ భాష ద్వారా కథలు చెప్పినట్లు దుర్గారావు తెలిపారు. కార్యక్రమంలో శిరీషా, పాఠకులు పాల్గొన్నారు.

వాలీబాల్ టోర్నమెంట్‌లో విద్యార్థినుల ప్రతిభ



సీఎం కప్ వాలీబాల్ టోర్నమెంట్‌లో ప్రతిభ కనబరచిన విద్యార్థినులు

జంగారెడ్డిగూడెం : మే 1 నుంచి 5 వరకు తిరుపతిలో రాష్ట్రస్థాయిలో జరిగిన సీఎం కప్ వాలీబాల్ టోర్నమెంట్లో పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన టీం సభ్యులుగా జంగారెడ్డిగూడెం సీఎస్‌టీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదువుతున్న బి.ఢిల్లీశ్వరి, కె.జయశ్రీ విజేతలుగా నిలిచారు. ఈ సందర్భంగా కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులకు కళాశాల ఫిజికల్ డైరెక్టర్ వినయ్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఎస్.ప్రసాద్ బాబు మాట్లాడుతూ ఈ విద్యార్థులు కళాశాలలో మొదటి సంవత్సరం బీజెడ్‌సీ కోర్సు చదువుతున్నారని తెలిపారు. వీరిద్దరూ ముఖ్య సభ్యులుగా ఉన్న పశ్చిమగోదావరి జిల్లా రాష్ట్ర స్థాయిలో వాలీబాల్ విభాగంలో సీఎం కప్‌లో విజేతగా నిలవడంపై హర్షం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని కోరుతూ విద్యార్థులను అభినందించారు.

మహిళల ఆర్థిక బలోపేతమే ప్రభుత్వ లక్ష్యం



సభలో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ ఆర్ విజయరాజు

చింతలపూడి : మహిళలు ఆర్థికంగా బలపడాలన్న సంకల్పంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళా మార్ట్‌లకు శ్రీకారం చుట్టారని డీఆర్‌డీఏ పీడీ ఆర్ విజయరాజు అన్నారు. స్థానిక ఐకేపీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన అభినందన సభలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. చింతలపూడిలో మహిళా మార్ట్ ప్రారంభించిన 90 రోజుల్లో కోటి రూపాయల అమ్మకాలు సాధించడం అభినందించదగ్గ విషయమన్నారు. ఈ సందర్భంగా ఈ ఘనత సాధించిన మహిళా మార్ట్ నిర్వాహకులను అభినందించారు. మహిళా మార్ట్‌ను మరింత అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం సహకారం అందిస్తుందని తెలిపారు. మహిళా సంఘాల్లోని సభ్యులు మహిళలచే నిర్వహించబడుతున్న మాల్‌లో నిత్యవసర సరుకులు కొనుగోలు చేసి ప్రోత్సహించాలని విజ్ఞప్తి చేశారు. ఏపీఎంలు, డీపీఎంలు, సీఓఏలు పాల్గొన్నారు.

నేడు పి.అంకంపాలెంలో గడపగడపకు

బుట్టాయగూడెం(జీలుగుమిల్లి) : జీలుగుమిల్లి మండలం పి.అంకంపాలెంలో బుధవారం మధ్యాహ్నం 3 గంటల నుంచి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ కె.మంగతయారు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే తెల్లం బాలరాజు పాల్గొని ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరిస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అన్ని శాఖల అధికారులు పాల్గొని జయప్రదం చేయాలని ఆమె కోరారు.

నేడు శ్రీనివాసపురంలో ఎమ్మెల్యే పర్యటన

జంగారెడ్డిగూడెం రూరల్ : మండలంలోని శ్రీనివాసపురంలో బుధవారం నిర్వహించే 135వ రోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా పాల్గొంటారని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు వామిశెట్టి హరిబాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే ప్రజల వద్దకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించడంతోపాటు సమస్యలు తెలుసుకుంటారని పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు పాల్గొనాలని హరిబాబు కోరారు.

జూదరుల అరెస్ట్

జంగారెడ్డిగూడెం : పేకాట శిబిరంపై దాడి చేసిన ఆరుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఎస్సై ఎం.సాగర్‌బాబు తెలిపారు. పట్టణంలోని సౌభాగ్య థియేటర్ వెనుక పేకాట ఆడుతున్నారని తమకు అందిన సమాచారం మేరకు దాడి చేసిన ఆరుగురు వ్యక్తులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ. 700 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

వీధి కుక్కలకు సంతాన నిరోధక శస్త్ర చికిత్సలు

ఏలూరు(మెట్రో): వీధి కుక్కలకు సంతాన నిరోధక శస్త్ర చికిత్సలు చేసేందుకు ఏబీసీ సెంటర్‌ను ప్రారంభించినట్లు ఏలూరు నగరపాలక సంస్థ కమిషనర్ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడూ ఏలూరు నగరపాలక సంస్థ పరిధిలోని 50 డివిజన్లలో విచ్చలవిడిగా వీధి కుక్కలు సంచారం ఉన్నందున, వాటి వల్ల చిన్న పిల్లలకు, ప్రజలకు తీవ్ర ఇబ్బంది కలుగుతోందన్నారు. ఈ నేపథ్యంలో అత్యవసరంగా వీధి కుక్కలను పట్టి, వాటికి సంతాన నిరోధక శస్త్ర చికిత్సలు, రేబిస్ వ్యాధి నిరోధక టీకాలు వేసేందుకు ఈనెల గత ఏడాది డిసెంబర్ 13న ఏలూరు నగరపాలక సంస్థ కౌన్సిల్ తీర్మానించిందన్నారు. ఆ మేరకు వీధికుక్కలకు సంతాన నిరోధక శస్త్ర చికిత్సలు చేసేందుకు యానిమల్ హాజ్ బెండరీ శాఖ జాయింట్ డైరెక్టర్ కార్యాలయ ఆవరణలో వీధి కుక్కల సంతాన నిరోధక శస్త్ర చికిత్సలు చేసేందుకు ఏబీసీ సెంటర్‌ను ప్రారంభినట్లు చెప్పారు.

మండుతున్న ఎండలు



ఉదయం 10 గంటలకే నిర్మానుష్యంగా ఉన్న చింతలపూడి మెయిన్ రోడ్డు

చింతలపూడి : మెట్ట ప్రాంతంలో గత 3 రోజులుగా సూర్యుడు చండ్ర నిప్పులు చెరుగుతున్నాడు. ఒక్కసారిగా పెరిగిన ఎండల తీవ్రతను తట్టుకోలేక ప్రజలు అల్లాడి పోతున్నారు. ఎండలకు తోడు వడగాల్పులు జనాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. దీనికి తోడ ఉక్కబోత ప్రజలను గుక్క తిప్పుకోనివ్వడంలేదు. మంగళవారం నియోజకవర్గ కేంద్రంలో 40 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఉదయం 7 గంటల నుంచే సూర్యుడు తన ప్రతాపాన్ని చూపిస్తున్నాడు. 10 గంటలకే రోడ్లన్నీ నిర్మానుష్యం అవుతున్నాయి. రాత్రి 9 గంటలు దాటినా వేడి గాలులు తగ్గడం లేదు. ఎండలకు తోడు విపరీతమైన వడగాల్పులు వీస్తుండటంతో మధ్యాహ్నం వేళల్లో రోడ్లపై జన సంచారం అంతగా కనిపించడం లేదు. ఒక వేళ ప్రయాణం చేయాల్సి వచ్చినా వడగాల్పుల నుంచి రక్షణ కోసం ముఖానికి ముసుగులు ధరించి ప్రయాణాలు చేస్తున్నారు.

మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభించి రైతులతో మాట్లాడుతున్న అధికారులు

పోలవరం రూరల్ : మండలంలోని కొత్త పట్టిసీమ, కృష్ణారావుపేట సొసైటీల వద్ద ఏపీ మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి, మార్క్‌ఫెడ్ మేనేజర్ సీహెచ్‌డీవీ ప్రసాద్ గుప్త మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మొక్కజొన్న కొనుగోలు చేసేటప్పుడు నాణ్యతను పరిశీలించేందుకు మండలానికి ఇద్దరు ప్రత్యేక అధికారులను నియమించారన్నారు. మార్కెఫెడ్ ద్వారా సొసైటీల్లో గోనె సంచులు సిద్ధం చేసి అవసరమైన రైతులకు అందజేస్తారన్నారు. మొక్కజొన్న విక్రయించిన రైతులకు 15 రోజుల్లోపు సొమ్ము చెల్లించడం జరుగుతుందన్నారు. పోలవరం మండలంలో 1013 మెట్రిక్ టన్నుల మొక్కజొన్న కొనుగోలు చేసేందుకు మార్క్‌ఫెడ్ నిర్ణయించిందన్నారు. కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ సలహామండలి చైర్మన్ దత్తి రాంబాబు, తహసీల్దార్ బి.సుమతి, మండల వ్యవసాయ శాఖాధికారి కె.రాంబాబు, ఎంపీడీవో సీహెచ్ శ్రీనివాసబాబు, సొసైటీ అధ్యక్షుడు బి.అప్పారావు, ఏపీ మార్క్‌ఫెడ్ సొసైటీ అధ్యక్షుడు అడ్డగర్ల సాయిబాబా, మైగాపుల దుర్గాప్రసాద్, వీరపరాజు వెంకన్నబాబు, రైతులు పాల్గొన్నారు.

ఏఐకేఎంఎస్ మండల మహాసభ

జంగారెడ్డిగూడెం : ఏఐకేఎంఎస్ మండల మహాసభ మంగళవారం నిర్వహించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి తలారి ప్రకాష్ పాల్గొని మాట్లాడారు. భూమి, భుక్తి, విముక్తి కోసం పోరాటాలు చేయాలని, సమసమాజ స్థాపనకు ప్రజా ఉద్యమాన్ని బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం జంగారెడ్డిగూడెం మండల నూతన మండల కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కె.బాబు, ఉపాధ్యక్షుడిగా కె.సుందరరావు, ప్రధాన కార్యదర్శిగా సముద్రాల బాల సుందరం, సహాయ కార్యదర్శిగా బోడా ఏసుపాదం, కోశాధికారిగా చాబత్తుల బుచ్చిరాజులను ఎన్నుకున్నట్లు ప్రకాష్ తెలిపారు. కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ సీనియర్ నాయకులు సాలి రాజశేఖర్, పూనెం పార్వతి, 150మంది సభ్యులు పాల్గొన్నారు.